3న వైద్యశాఖ కార్యాలయం ఎదుట ధర్నా

ఖలీల్‌వాడి, జూన్ 28 : తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమా రాజ్‌కు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, ఓమయ్య, కార్మికులు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వ దవాఖానలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి జీవో నంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లిస్తామని, ఏడాదికి 23 ఆర్థిక సెలవులు ఇస్తామని అధికారులు హామీ ఇచ్చి అమలుపర్చలేదని పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం జూలై 3న హైదరాబాద్‌లోని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ కార్యాలయం ఎదుట నిరసన నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అహ్మదీబేగం, భాగ్యలక్ష్మి, కవిత, రోజా పాల్గొన్నారు.

విద్యార్థి ఉద్యమవేదిక ఆధ్వర్యంలో అకాడమీ ఎక్స్‌లెన్స్ అవార్డులు

ఖలీల్‌వాడి, జూన్ 28 : తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో జూలై 1న అకాడమీ ఎక్స్‌లెన్స్ అవార్డులు అందజేయనున్నట్లు టీవీయూవీ జిల్లా కన్వీనర్ అజయ్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని టీవీయూవీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానిస్తామని పేర్కొన్నారు. అకాడమీ ఎక్స్‌లెన్స్ అవార్డు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు రమేశ్ ముదిరాజ్ హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు నవీన్, సుభాష్ పాల్గొన్నారు.

గ్రంథాలయ డైరెక్టర్‌కు సన్మానం



గ్రంథాలయ సంస్థ డైరెక్టర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

సుభాష్‌నగర్, జూన్ 28 :రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన ఏవీఎన్ రాజును జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు హైదరాబాద్ గ్రంథాలయ డైరెక్టర్ కార్యాలయంలో శుక్రవారం కలిసి అభినందించారు. జిల్లా గ్రంథాలయ యూనియన్ అధ్యక్షుడు కిషన్, కార్యదర్శి సందీప్‌కుమార్, కార్యవర్గ సభ్యులు శ్రావణ్‌కుమార్, తారకం తదితరులు శాలువా కప్పి సన్మానించారు. డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన ఏవీఎన్ రాజు పదేండ్ల క్రితం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శిగా పనిచేశారు.

అనుమానాస్పద మృతిపై విచారణ చేపట్టాలి

వినాయక్‌నగర్, జూన్ 28 : అదృశ్యమైన మారుపాక దత్తాద్రి మృతదేహం మూడురోజుల క్రితం డిచ్‌పల్లి చెరువులో తేలడంపై విచారణ చేపట్టాలని మృతుడి భార్య మారుపాక సాయమ్మ జిల్లా కేంద్రంలో పోలీసు ఉన్నతాధికారులకు శుక్రవారం ఫిర్యాదు చేసింది. తన భర్త మిస్సింగ్‌పై సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 25న ఫిర్యాదు చేశామని, అనుమానాస్పద మృతిలో పోలీసులు అనుమానితులను విచారణ చేయకుండా వదిలేశారని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

'ఓపెన్ టెండర్లు పిలవాలి'

ఆర్మూర్‌టౌన్,జూన్28: ఆర్మూర్ మున్సిపల్‌కు సంబంధించిన మడిగెలకు ఓపెన్ టెండర్లకు పిలవాలని కోరుతూ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రాజుకు బీజేపీ నాయకులు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్ మాట్లాడుతూ మడిగెలు లీజుకు తీసుకున్న వారు ఇతరులకు సబ్ లీజుకు ఇచ్చి మున్సిపాలిటీకి నామమాత్రపు అద్దె చెల్లిస్తూ మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్నారని అన్నారు. సబ్ లీజును రద్దు చేయాలని కోరారు.

ఆక్యుప్రెషర్ చికిత్స శిబిరం ప్రారంభం

శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా గవర్నర్ లయన్ వేమూరి లక్ష్మి

బోధన్, జూన్ 28: బోధన్ పట్టణం రాకాసీపేట్ కంటి ఆసుపత్రిలోని ఆడిటోరియంలో శుక్రవారం ఆక్యుప్రెషర్ చికిత్స కేంద్రాన్ని లయన్స్ జిల్లా గవర్నర్ లయన్ వేమూరి లక్ష్మి ప్రారంభించారు. రాజస్థాన్‌కు చెందిన ఆక్యుప్రెషర్ రీసెర్చ్ అండ్ ట్రీట్‌మెంట్ సెంటర్ జోర్పూర్ వారిచే ఈ కేంద్రాన్ని నిర్వహించేందుకు లయన్స్ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. వివిధ రకాల వ్యాధులకు ఆక్యుప్రెషర్ ద్వారా చికిత్స అందిస్తామని డాక్టర్లు ప్రమోద్, జితేందర్ తెలిపారు. ఈ శిబిరం వారం రోజులపాటు కొనసాగుతుందని లయన్స్ జిల్లా గవర్నర్ వేమూరి లక్ష్మి సూచించారు. కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపకుడు పోలవరపు బసవేశ్వర్ రావు, జిల్లా క్యాబినెట్ కార్యదర్శి లయన్ శ్రీనివాస్ రావు, జిల్లా క్యాబినెట్ కోశాధికారి కొడాలి కిశోర్, రీజియన్ చైర్మన్ లయన్ కొయ్యాడ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని ప్రత్యేకపూజలు

బొప్పాపూర్‌లో హనుమాన్ ఆలయం వద్ద గ్రామస్తులు, చందూర్‌లో...

రుద్రూర్/ చందూర్, జూన్ 28 : వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ రుద్రూర్ మండలం బొప్పాపూర్‌లో గ్రామస్తులు బొప్పాపూర్‌లో గ్రామదేవతలకు జలాభిషేకం నిర్వహించారు. వీడీసీ ఆధ్వర్యంలో త్రివేణి సంగమం నుంచి గంగాజలాన్ని తీసుకువచ్చి, గ్రామంలోని హనుమాన్ ఆలయంతో పాటు పోచమ్మ, గజ్జలమ్మ ఆలయాల్లో జలాభిషేకం చేశారు. అంబంలో హిందువు, ముస్లిములు గ్రామశివారులో గుట్టపై ఉన్న దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు నారోజి గంగారాం, వీడీసీ చైర్మన్ పట్ల సురేశ్, సురేందర్, లచ్చయ్య, దత్తాత్రి, గంగారాం, అంబం గ్రామస్తులు వీడీసీ చైర్మన్ రెంజర్ల గంగారాం, కార్యదర్శి గంగలి రాములు, ఆశం రాములు, లక్ష్మణ్, శానం కపిల్, శివరాం, పోశెట్టి, సాయిలు, నిజాం పాల్గొన్నారు.

చందూర్ మండలకేంద్రంలో వర్షాలు కురవాలని కోరుతూ.. గ్రామపెద్దల సమక్షంలో గంగాజలంతో గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు పండాలని, గ్రామస్తులు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాయిరెడ్డి, విండో చైర్మన్ ప్యారం అశోక్, నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో బాలకృష్ణ

ధర్పల్లి, జూన్ 28 : వానకాలం ప్రారంభమైనందున గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా, తాగునీరు కలుషితం కాకుండా చూడాలని ఎంపీడీవో బాలకృష్ణ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. మండలపరిషత్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. మిషన్ భగీరథ సర్వే, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ పనుల సర్వేపై సమీక్షించారు. పండ్ల తోటల పెంపకానికి రైతులను ప్రోత్సహించాలని, ఉపాధిహామీ కింద చేపట్టిన పనుల వివరాలు తెలిపే బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీవో రాజేశ్, ఈసీ సంజీవ్, మిషన్ భగీరథ ఇంట్రా ఏఈ పాల్గొన్నారు.

గురుకులంలో దరఖాస్తులకు ఆహ్వానం

డిచ్‌పల్లి, జూన్ 28 : మండలంలోని సుద్దపల్లిలో ఉన్న గురుకుల పాఠశాలలో చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ గోదావరి శుక్రవారం ఒక ప్రకటనలతో తెలిపారు. 5 నుంచి 9వ తరగతి వరకు మిగిలి ఉన్న సీట్ల భర్తీకి వచ్చే నెల 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాఠశాల బదిలీ కోరుకునే వారు ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

సింగరేణికి బొగ్గు గనులను కేటాయించకపోతే పోరాటం

- కలెక్టరేట్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

కంఠేశ్వర్, జూన్ 28 : సింగరేణికి బొగ్గు గనులను కేటాయించకపోతే ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తామని సీపీఎం నాయకులు అన్నారు. పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్ బాబు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం రూ. 6 లక్షల కోట్లు ప్రభుత్వ సంస్థల ఆస్తులను గుర్తించిందని, ఇందులో భాగంగా బొగ్గు గనుల ద్వారా 28 వేల 700 కోట్ల రూపాయలను రాబట్టేందుకు వేలం వేసేందుకు నిర్ణయించిందని అన్నారు. తెలంగాణ నుంచి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి.. మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు గనుల బ్లాక్‌లను వేలం వేయాలని నిర్ణయించడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పెద్ది వెంకటరాములు, నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

సన్మానం పొందిన మండల పరిషత్ సభ్యులు

వేల్పూర్, జూన్ 28: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సభ్యులు, అధికారులతో ఎంపీడీవో కిషన్ చర్చించారు. పనులు త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం చివరిది కావడంతో సభ్యులను అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కిషన్, జడ్పీటీసీ ఆల్లకొండ భారతి, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పీవీ నరసింహారావు జయంతి

పీవీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

ఖలీల్‌వాడి/ సిరికొండ/ కంఠేశ్వర్, జూన్ 28 : దివంగత ప్రధానమంత్రి, బహుభాషా కోవిదుడు పీవీ నరసింహారావు జయంతిని జిల్లాలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బోర్గాం (పీ) వద్ద ఉన్న పీవీ విగ్రహానికి జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ శంకర్, ప్రభాకర్‌రెడ్డి, సీఈవో ఉష, డిప్యూటీ సీఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు. సిరికొండ మండలంలోని సత్యశోధక్ పాఠశాలలో ప్రిన్సిపాల్ నర్సయ్య పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీవీ సేవలను విద్యార్థులకు వివరించారు. కాంగ్రెస్ భవన్‌లో పీవీ చిత్రపటానికి కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ తదితరులు నివాళులర్పించారు.

కవితా పోటీల్లో 'విజయ్' విద్యార్థిని ప్రతిభ

మహతిని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం, సిబ్బంది

ఖలీల్‌వాడి, జూన్ 28 : వసుంధర విజ్ఞాన వికాస మండలి ఆధ్వర్యంలో కర్క ముత్తారెడ్డి 31వ స్మారక కవితా పోటీలను ఇటీవల నిర్వహించగా.. జిల్లాకేంద్రంలోని విజయ్ పాఠశాల విద్యార్థిని ప్రతిభ కనబర్చింది. తెలుగు రాష్ట్రాల విద్యార్థులు పాల్గొనగా ఐదుగురు విద్యార్థులు రాసిన కవితలు బహుమతికి ఎంపికయ్యాయని, ఇందులో విజయ్ హైస్కూల్‌లోని 9వ తరగతి చదువుతున్న వై.మహతి 'పర్యావరణ పరిరక్షణ' అంశంపై కవిత రాసి రూ.1000 నగదు, మెమెంటో, ప్రశంసాపత్రం అందుకున్నట్లు తెలిపారు. మహతిని విజయ్ హైస్కూల్ వ్యవస్థాపకురాలు డాక్టర్ అమృతలత, సిబ్బంది పాఠశాలలో శుక్రవారం అభినందించారు.

పత్రీజీ ధ్యాన మహా యజ్ఞం ప్రారంభం

వేదికపై జడ్పీ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావు, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత

ఆర్మూర్‌టౌన్,జూన్28: పట్టణంలోని నవనాథ సిద్దేశ్వర గుట్టపై ఉన్న నవనాథ పిరమిడ్ ధ్యాన క్షేత్రంలో శుక్రవారం పత్రీజీ ధ్యాన మహా యజ్ఞం కార్యక్రమం ప్రారంభమైంది. జడ్పీ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావు, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత హాజరయ్యారు. పత్రీజీ ధ్యాన మహా యజ్ఞంలో భాగంగా సంగీత నాద ధ్యానం, గురువుల ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు మూడు రోజుల పాటు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

టీబీ నిర్మూలనే లక్ష్యం

మోర్తాడ్, జూన్ 28: 2025 సంవత్సరం నాటికి టీబీని నిర్మూలించడమే లక్ష్యమని డాక్టర్ సంతోష్ అన్నారు. శుక్రవారం చౌట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీసీజీ టీకాలపై వైద్యసిబ్బంది, ఆశ వర్కర్లకు శిక్షణ ఇచ్చి సూచనలు చేశారు. ఇక నుంచి పెద్దలకు కూడా బీసీజీ టీకా ఇవ్వనున్నట్లు తెలిపారు. ముందుగా క్షయవ్యాధి గ్రస్తులు ఉన్న ఇంటివారికి, 60 ఏండ్లు నిండిన వారికి, పొగ తాగేవారికి, డయాబెటిక్‌తో బాధపడుతున్న వారికి వ్యాక్సిన్ ఇస్తున్నట్లు తెలిపారు. చౌట్‌పల్లి మెడికల్ ఆఫీసర్ సుప్రియ, హెచ్ఈవో సత్యనారాయణ, జిల్లా టీబీ కోఆర్డినేటర్ రవిగౌడ్ పాల్గొన్నారు.

18 డెడ్‌బాడీ ఫ్రీజర్ల వితరణ

డెడ్‌బాడీ ఫ్రీజర్లను వితరణ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఎడపల్లి, జూన్ 28 : మండల కేంద్రంలోని వృద్ధాశ్రమంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ లక్ష్మి శుక్రవారం లయన్స్ క్లబ్ ఉన్న గ్రామీణ ప్రాంతాలకు 18 డెడ్‌బాడీ ఫ్రీజర్లను వితరణ చేశారు. ఆమె మట్లాడుతూ... పల్లెల్లో డెడ్‌బాడీ ఫ్రీజర్ల కొరత ఉందని, స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ లయన్స్ క్లబ్ అందించిన ఆర్థిక సాయంతో వితరణ చేపట్టినట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు బసవేశ్వర రావు, కొడాలి కిశోర్, శ్రీనివాసరావు, సూర్యనారాయణ, ప్రకాశ్ రావు తదితరులు పాల్గొన్నారు.

అల్బెండజోల్ మాత్రల పంపిణీ

కోటగిరి, జూన్ 28 : మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ నులిపురుగుల నివారణ మాత్రలను శుక్రవారం పంపిణీ చేశారు. ఉమ్మడి కోటగిరి మండలంలో 9,894 మంది పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతి, ఏఎన్ఎం శ్రీదేవి, రోజా, ప్రమీల, ఆశ కార్యకర్తలు అనిత, సంగీత, అక్తరీ పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

వినాయక్‌నగర్, జూన్ 28 : జిల్లాకేంద్రంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో గురువారం సాయంత్రం దాడులు నిర్వహించినట్లు త్రీటౌన్ ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఓ మహిళ ఇంటిని అద్దెకు తీసుకొని వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు తెలియడంతో, ఇంటిపై దాడులు నిర్వహించామని, నిర్వాహకురాలితోపాటు ఒక విటుడు, మరో ఇద్దరు మహిళలను గుర్తించామని వెల్లడించారు. మహిళలకు కౌన్సెలింగ్ నిమిత్తం సఖీ సెంటర్‌కు తరలించామని, నిర్వాహకురాలితోపాటు ఆ ఇంట్లో పట్టుబడిన విటుడ దండి వెంకట్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై వెల్లడించారు.

కురిసిన వర్షం.. రైతన్న హర్షం

ఏర్గట్ల, జూన్ 28: వారం రోజులుగా వర్షాలు లేక రైతులు ఎదురు చూస్తున్నారు. గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం తెల్లవారుజాము వర్షం కురవడంతో మండలంలోని ఎనిమిది గ్రామాల్లో ఉన్న పొలాల్లో నీరు నిలిచింది. ఇప్పటికే పసుపు, మక్కజొన్న, సోయాబీన్ విత్తనాలు నాటిన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న గోర్తి ఈశ్వర ట్రస్ట్ ప్రతినిధులు

డిచ్‌పల్లి, జూన్ 28 : జక్రాన్‌పల్లి మండలం పడకల్ జడ్పీహెచ్ఎస్‌లో గోర్తి ఈశ్వర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు శుక్రవారం ఆర్థిక సహాయం అందజేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఉషాబాల పవన్‌కుమార్ సహకారంతో ఎస్సెస్సీలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులు హర్షిక, శంకర్‌కు రూ.12,500 చొప్పున ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు పాటుకూరి తిరుపతిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సురేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **జూలై 1న కోటగిరి మండల సర్వసభ్య సమావేశం -** కోటగిరి, జూన్ 28 : మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ వల్లెపల్లి సునీతా శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మనోహర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.
- **చెరువు కబ్జాకాకుండా చూడాలని వినతి -** చందూర్, జూన్ 28 : మోస్రా మండలం చింతకుంట చెరువు కబ్జాకు గురికాకుండా చూడాలని చింతకుంట గ్రామస్తులు కోరుతున్నారు. చెరువును ఆనుకొని వ్యవసాయ భూమి ఉన్న ఓ వ్యక్తి ట్రాక్టర్లతో చదును చేసి కబ్జా చేస్తున్నాడని ఆరోపిస్తూ తహసీల్దార్‌తోపాటు కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఫిర్యాదు చేశారు.
- **ఘనంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి -** పొతంగల్, జూన్ 28 : మండలకేంద్రంలో డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని బీజేవైఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఏక్ పేడ్ మాకా నామ్ (అమ్మ పేరుతో ఓ మొక్క) పేరుతో మొక్కలు పంపిణీ చేశారు.
- **ఘనంగా లక్ష పుష్పార్చన -** సుభాష్‌నగర్, జూన్ 28 : జిల్లాకేంద్రంలోని న్యాల్‌కల్‌రోడ్‌లో ఉన్న లలితాదేవి ఆలయంలో 21వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వేలేటి రాజేందర్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, సౌందర్యలహరి పారాయణం నిర్వహించి, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.
- **పేకాటస్థావరంపై దాడి -** రుద్రూర్, జూన్ 27 : మండలకేంద్రంలోని జేఎన్‌సీ కాలనీలో పేకాట స్థావరంపై పోలీసులు శుక్రవారం దాడి చేశారు. నలుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని, వారి నుంచి రూ.7,910 స్వాధీనం చేసుకున్నామని ఎస్సై అప్పారావు తెలిపారు.
- **తమను తిరిగి రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌కు పంపాలని వినతి-** డిచ్‌పల్లి, జూన్ 28 : తమను తిరిగి రెవెన్యూ శాఖకు బదిలీ చేయాలని కోరుతూ అదనపు కలెక్టర్‌కు కిరణ్‌కుమార్ జూనియర్ అసిస్టెంట్లు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. రెవెన్యూ శాఖ నుంచి మున్సిపాలిటీ శాఖకు వెళ్లిన జిల్లా వార్డు ఆఫీసర్లు, జూనియర్ అసిస్టెంట్లను తిరిగి రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లోకి బదిలీ చేయాలని కోరారు.
- **చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలి -** డిచ్‌పల్లి, జూన్ 28 : ధర్మారం వద్ద ఉన్న తిరుమల డెంటల్ కళాశాల నుంచి బర్ధిపూర్‌లోని కృష్ణ హోటల్ వరకు రోడ్డు వైపు ఉన్న చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలని గొల్లపల్లి మాజీ సర్పంచ్ గుడాల లింగం కోరారు. చెత్తను ధర్మారం డంప్ యార్డు పక్కనే ఉన్న కాలువలోని నీటిలో వేయడంతో నీరు కలుషితమై గొల్లపల్లి గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.
- **పీవీకి ఘన నివాళి-** మోర్తాడ్, జూన్28: మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో పీవీ నరసింహరావు జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాబూరావు, గంగాధర్, దశరథ్ పాల్గొన్నారు.
- **తైబజార్ వేలం -** ఎడపల్లి, జూన్ 28: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో శంకర్ నాయక్ ఆధ్వర్యంలో ఎడపల్లి వారసంత తైబజార్ వేలం శుక్రవారం నిర్వహించారు. రూ.4లక్షల నలభై వేలకు మజారుద్దీన్ దక్కించుకున్నాడు. ఇది 9 నెలల ఒప్పందం అని జీపీ కార్యదర్శి నాగరాజు గౌడ్ తెలిపారు.
- **క్షీరాభిషేకం-** నవీపేట, జూన్ 28: రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ ప్రకటనను హర్షిస్తూ మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చిత్ర పటాలకు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. కర్యక్రమంలో ఎంపీపీ సంగెం శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.
- **విద్యార్థికి సన్మానం-** ఆర్మూర్‌టౌన్, జూన్28: పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం 500 మార్కులకు 479 సాధించిన కె.అజయ్‌ని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి రవికుమార్, అధ్యాపకులు సన్మానించారు. విద్యార్థికి రూ.4500 నగదు ప్రోత్సాహకం అందించారు. ప్రిన్సిపాల్ నర్సయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.
- **విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేత -** మోర్తాడ్, జూన్ 28: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను డీఐఈవో రవికుమార్ పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ గంగాధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.
- **పెర్మిట్‌లో..-**ఆర్మూర్‌టౌన్, జూన్28: మున్సిపల్ పరిధిలోని పెర్మిట్‌లో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య అందజేశారు.
- **సమస్య పరిష్కరించాలని వినతి-**ఆర్మూర్‌టౌన్, జూన్28: చేపూర్‌లో శ్మశాన వాటిక, రోడ్డు సమస్య పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రాజాగౌడ్, ఏసీపీ బస్వారెడ్డికి వీడీసీ సభ్యులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. 25 ఏండ్ల క్రితం గ్రామానికి చెందిన తండ్రీకొడుకు సారంగి పెద్ద సాందన్న, విజయ్ అప్పటి రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని అన్నారు.

'ఆగస్టు 15లోగా రైతురుణ మాఫీ'

మోర్తాడ్, జూన్28: జూలై 1 నుంచి ఆగస్టు 15 వరకు రైతు రుణమాఫీ చేసేందుకు పూర్తి ప్రణాళికను అధికార యంత్రాంగం తయారు చేస్తున్నదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పది సంవత్సరాలు కేంద్రంలో ఉన్న బీజేపీ ఇచ్చిన హామీలన్నింటినీ తుంగలో తొక్కిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే దీక్ష చేపడుతానని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ప్రకటించడం విడ్డూరమన్నారు. సమావేశంలో కాంగ్రెస్ కమ్మర్‌పల్లి మండల అధ్యక్షుడు రవి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేణురాజ్, నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్న